క్లుప్తంగా

శివాలయంలో జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యేక పూజలు



జడ్జి మారుతి ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్, అధికారులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి దంపతులకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం ఆలయ చైర్మన్ అమర్‌గౌడ్ దంపతులు వారిని శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

మునగాల : మండలంలోని కలకోవలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్, తిప్పన వీరయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు పనస శంకర్, పనస చిన్న శ్రీను, దొంగరి అప్పారావు, పనస సింహాద్రి, జూకూరి వసంత రావు, కుడుముల వీరయ్య, పులి రాంబాబు, పనస రమేష్‌ల ఆధ్వర్యంలో పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి, ఓరుగంటి రవి, సుంకర పిచ్చయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సుంకరి క్రాంతికుమార్

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ రూ. 10 వేల విలువ గల ఐఐటీ, నీట్ పరీక్షల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసువర్ణలక్ష్మి దాంపత్య వ్రతం



దాంపత్య వ్రతంలో పాల్గొన్న ఆశ్రమ ఉపాసకులు, భక్తులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో ఆదివారం రాత్రి శ్రీసువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో సువర్ణ లక్ష్మి అమ్మవారి చిత్రపటానికి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సత్సంగంలో భాగంగా ఆశ్రమ ఉపాసకులు గురుమంత్రోపదేశం విశిష్టతను భక్తులకు వివరించారు. జనవరి 1వ తేదీన హైదరాబాద్‌లో గురుమంత్రోపదేశం ఉంటుందని, ప్రతిఒక్కరూ ఆ మంత్రోపదేశాన్ని స్వీకరించి ఆచరించాలన్నారు. అనంతరం తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ ఉపాసకులు నాగనివేదితమ్మ, పవిత్రమ్మ, పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మొలుగూరి గోపి

చిలుకూరు : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి అన్నారు. సోమవారం మండలంలోని బేతవోలు గ్రామంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరు ధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంటలకు రసాయన మందులు వినియోగిస్తుండడంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు తినాలన్నారు. చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు బెల్లంకొండ అంజయ్య, రాజు, గురుస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమన్వయం లేక.. సంతకాలు చేయక

- నిర్లక్ష్య ధోరణిలో తహసీల్దార్ కార్యాలయ అధికారులు
- ఆఫీస్ చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్న దరఖాస్తుదారులు
- సిబ్బందితో వాగ్వాదానికి దిగిన హుజూర్‌నగర్ ఎంపీపీ

చిలుకూరు : చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో పలువురు అధికారుల మధ్య సమన్వయ లోపంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తహసీల్దార్ సరిత ఇటీవల చిలుకూరుకు వచ్చారు. విధుల్లో చేరిన నాటి నుంచి ఆమె ఎన్నికల్లో విధుల్లోనే ఉండటంతో పలువురు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినబడుతున్నాయి. డిప్యూటీ తహసీల్దార్‌కు, ఆర్‌ఐ మధ్య సమన్వయం లోపం ఉన్నట్లు సమాచారం. దీంతో



చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం

గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవలో ఆన్‌లైన్ చేసుకొని కార్యాలయంలో అందజేసి నిత్యం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

డిప్యూటీ తహసీల్దార్ వద్దే పెండింగ్ !

కాగా, గత కొన్ని నెలలుగా ఆర్‌ఐ సంతకం చేసిన పలు దరఖాస్తులు డిప్యూటీ తహసీల్దార్ వద్దే నిలిచిపోయాయని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తుదారులు ఆర్‌ఐ దగ్గరకు వెళితే తన దగ్గర ఫైల్స్ పెండింగ్ లేవని, తాను సంతకం చేశాక తనకు ఎలాంటి సంబంధం లేదని ఆర్‌ఐ చెబుతున్నారని, రికార్డు గదిలో కూడా తమ దరఖాస్తులు లేకపోవడంతో తమ దరఖాస్తులు ఎక్కడ ఆగిపోయాయో తెలియక దరఖాస్తుదారులు తలలు పట్టుకుంటున్నారు. తహసీల్దార్‌కు తప్పా మిగిలిన అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం డబ్బే అని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

అధికారులతో ఎంపీపీ వాగ్వాదం

తాను పొజిషన్‌లో ఉన్న భూమి సర్వే నంబర్‌ను తొలగించి వేరే సర్వే నంబర్‌లో తన భూమిని నమోదు చేశారని హుజూర్‌నగర్ ఎంపీపీ గుడెపు శ్రీనివాస్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. తన భూమిని ధరణిలో ఇష్టానుసారంగా మార్చారని అవేదన వ్యక్తం చేశారు. తన భూమి 997 సర్వే నంబర్‌లో ఉండాలని, కానీ అక్కడ నుంచి తొలగించి 1037లో నమోదు చేశారని మండిపడ్డారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ధరణిలో మార్పులు చేసిందని బహిరంగంగానే ఎంపీపీ ఆరోపించారు. కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే పనులు అవుతాయని అనే ఆరోపణ కూడా ఆయన చేసినట్లు తెలిసింది.



తహసీల్దార్ కార్యాలయంలో హుజూర్‌నగర్ ఎంపీపీ

20 రోజులుగా తిరుగుతున్నా

నా పేరు మాదవరపు కొండలు. నేను 20 రోజుల క్రితం కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. ఆ దరఖాస్తును ఆర్‌ఐ విచారణ చేసి రికార్డు గదిలో అప్పగించారు. ఆ తరువాత డిప్యూటీ తహసీల్దార్ వద్ద ఫైల్ ఆగిపోయిందని కార్యాలయ అధికారులు చెబుతున్నారు. దీంతో గతవారం రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– మాదవరపు కొండలు, చిలుకూరు

ఉపాధి కల్పించాలని ఆటోడ్రైవర్ల ధర్నా

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో వేలాది మంది ఆటోడ్రైవర్లు జీవనోపాధి కోల్పోయారని, వారికి ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆటో డ్రైవర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. వీరికి బీఆర్‌ఎస్ నాయకుడు కందిబండ సత్యనారాయణ, సీపీఐ నాయకుడు చిల్లచర్ల ప్రభాకర్ మద్దతు పలికి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రస్తుతం పనిలేకపోవడంతో ప్రతినెల కిస్తీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ప్రతినెల రూ.12వేల ఆదాయం వచ్చే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బచ్చలకూరి స్వరాజ్యం, సీపీఐ జిల్లా నాయకుడు సీహెచ్.సీతారాం, ఆటోడ్రైవర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జానీ, మేడిపల్లి సతీష్, నాయకులు గంధం నారాయణ, షేక్ లాలు, జూలకంటి శ్రీను, మేరిగ కరుణాకర్, ఉపేందర్, వల్లోజు రాజు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

నడిగూడెం : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ నవీన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో నిరుపేద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషకరమైన విషయమే కానీ నష్టపోతున్న ఆటో డ్రైవర్లను కూడా ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుందని అన్నారు.



మునగాల : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు



నేరేడుచర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

'మా బతుకులు రోడ్డున పడ్డాయి'

నేరేడుచర్ల : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నేరేడుచర్లలోని కోదాడ– జడ్చర్ల ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలు నడవక తమ కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల పెన్షన్ అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, కార్మికులు ఉన్నారు.

వైభవంగా శ్రీవల్లీ దేవసేనస్వామి కల్యాణం

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీవేంకటేశ్వర దేవాలయంలో సోమవారం శ్రీవల్లీ దేవసేన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఇరుగంటి శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారి కల్యాణం అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్వాయి శ్రీనివాస్‌రావు, పాల్వాయి రమేష్, భక్తులు ఉన్నారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని వినతి

నేరేడుచర్ల : మిర్యాలగూడ డిపో నుంచి దాసారం మీదుగా సూర్యాపేటకు నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని మండలంలోని దాసారం గ్రామానికి చెందిన వంగాల నవీన్, గుర్రం వెంకట్‌రెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం వారు మిర్యాలగూడ డిపో మేనేజర్ పాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్‌కు ముందు మిర్యాలగూడ డిపో నుంచి మూడు ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ 8 ట్రిప్పులు నడిచేవని, కరోనా కాలం నుంచి బస్సులు రద్దు కావడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించినందున ఆర్టీసీ బస్సులను తక్షణమే పునరుద్ధరిస్తే మహిళలు సద్వినియోగం చేసుకుంటారని అన్నారు.



డీఎం పాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దాసారం గ్రామస్తులు

సత్రంలో వసతుల కల్పనకు ముందుకురావాలి

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉన్న మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని సత్రం కమిటీ అధ్యక్షుడు తోట వెంకయ్య, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోలా నాగేశ్వరరావు కోరారు. సోమవారం వారు సత్రంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22న జరిగే ముక్కోటి వేడుకలకు వచ్చే భక్తులకు సత్రంలో భోజన వసతికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ కోకన్వీనర్ ఆకుల నాగేశ్వరరావు, నారాయణస్వామి, విజయ, విజయశ్రీ, రాము, కేఎస్ఆర్, కాశీవిశ్వనాథం, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలను విజయవంతం చేయాలి

మఠంపల్లి : మట్టపల్లిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించబోయే ముక్కోటి ఏకాదశి వేడుకలను విజయవంతం చేయాలని గౌడ అన్నదాన సత్రం కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ నర్సింగ్ వెంకటేశ్వర్లుగౌడ్, అధ్యక్షుడు దొంతగాని రాములుగౌడ్ కోరారు. స్థానిక సత్రంలో జరిగిన అన్నదాన సత్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ముక్కోటి ఏకాదశికి ఆలయంలో 23వ తేదీ తెల్లవారుజామున స్వామివారు ఉత్తర (వైకుంఠ) ద్వారదర్శనం గావిస్తారన్నారు. వేడుకలను వచ్చే తెలుగు రాష్ట్రాల గౌడ భక్తులకు సత్రంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి గుండు గురువయ్యగౌడ్, బూర సోములుగౌడ్, నేలపట్ల అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ ఎంపీపీపై అవిశ్వాసానికి ఏర్పాట్లు?

- సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఎంపీటీసీలు
- మండల పరిషత్ నిధుల దుర్వినియోగమే కారణం

కోదాడ రూరల్: కోదాడ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు సిద్ధమవుతున్నారు. మండల పరిషత్ నిధుల దుర్వినియోగంలో నిజాలు బయటకు వస్తే పదవి నుంచి తొలగించాల్సిందేనని.. అది కుదరకపోతే అవిశ్వాసం పెట్టి ఈ పదవి నుంచి ఆమెను దించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. మరో ఆరునెలల పాటు ఈ ఎంపీపీ పదవిలో ఉండనున్నారు. అయితే కోదాడ మండల పరిషత్ పాలక వర్గంలో మొత్తం 11మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా దోరకుంట, ఎర్రవరం ఎంపీటీసీలు మృతి చెందడంతో ప్రస్తుతం తొమ్మిది మంది సభ్యులు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్ సభ్యులు గణపవరం, తొగర్రాయి ఉండగా రెడ్లకుంట, కాపుగల్లు నుంచి ఓ ఎంపీటీసీ ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ బలం 4కు చేరింది. వీరితో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన మరో ఇద్దరు ఎంపీటీసీలు కూడా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నారు. దీంతో కాంగ్రెస్ ఎంపీటీసీల బలం 6కు చేరినట్లయ్యింది. ఎంపీపీతో కలిపి బీఆర్‌ఎస్ వైపు ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే మిగలడంతో అవిశ్వాసం నెగ్గనుంది. ఒకవేళ బీఆర్‌ఎస్ నుంచి మద్దతు ఇస్తున్న ఇద్దరు ఎంపీటీసీలు వారి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నా.. అవిశ్వాసం నెగ్గి ఎంపీపీ పదవిని దక్కించుకునేలా కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నేడో, రేపో సంబంధిత అధికారులకు నోటీసు ఇచ్చేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం.

దేవాలయాల చైర్మన్ల ఎన్నిక



నూతన చైర్మన్లను సత్కరిస్తున్న గ్రామస్తులు

మునగాల : మండలంలోని రేపాల గ్రామపంచాయతీ పరిధిలో గల నాలుగు దేవాలయాలకు సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్వర్యంలో నూతన చైర్మన్లను శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ చైర్మన్‌గా సారిక చినరామయ్య, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్‌గా గండు జితేందర్, ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా మేక నరేందర్‌రెడ్డి, శివాలయం దేవాలయ కమిటీ చైర్మన్‌గా మెరుగు ముత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామంలో అందరి సహకారంతో దేవాలయాల అభివృద్ధికి ఆయా కమిటీల చైర్మన్‌లు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సేవాకాలం, ఆళ్వార్లకు మంగళాశాసనం, రెండవ పాశురతాత్పర్యం వంటి పూజలు చేశారు. అనంతరం స్వామివార్లకు పల్లకీసేవ తదనంతరం తీర్థ ప్రసాద గోష్టి, ఆరగింపును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈవో ఎంపి లక్ష్మణరావు, ధర్మకర్తలు సురభి కుషల్, కృష్ణయ్య, పూర్ణ, కనకయ్య, మల్లయ్య, అర్చకులు మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌కుమార్‌గౌడ్, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకోదండరామాలయంలో..

నడిగూడెం : మండల కేంద్రంలోని రామాలయంతో పాటు సిరిపురంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం చక్రధరాచార్యులు, వరదాచార్యులు, మొక్క భిక్షపతి, పసుపులేటి యాదగిరి, తాళ్లూరి రమేష్, భక్తులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : స్వామివార్లకు పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

గోదాదేవికి పల్లకీసేవ

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున గోదాదేవిని పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. విష్ణు సహస్రం, గోదా, రామానుజ అష్టోత్తరాలతో పూజలు చేసి అనంతరం గోదాదేవిని పల్లకిలో దేవాలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. శ్రీనివాసాచార్యులు ముకుందమాల శ్లోకాలను పఠిస్తూ ఆలయం చుట్టూ దివిటీలతో పల్లకీసేవ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, అధికారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



నడిగూడెం : శ్రీకోదండరామాలయంలో..



హుజూర్‌నగర్ : గోదాదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

గుంత పూడ్చాలి

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో భాగంగా మట్టి కోసం తవ్విన గుంతన పూడ్చివేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు కోరారు. సోమవారం ఆయన గుంతను పరిశీలించి మాట్లాడారు. గుంతతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట వార్డుసభ్యుడు పచ్చిగోళ్ల శ్రీను, పంది నరేష్, చింత త్రిమూర్తి, పేరెల్లి నరేష్, యువ రాజు, వివేక్ పాల్గొన్నారు.

సాగుదారులకే రైతుబంధు ఇవ్వాలి

నేరేడుచర్ల : గ్రామీణ ప్రాంతాల్లో కేవలం వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతులకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూస్వాములు, బడా నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా రైతుబంధు అందించడంతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని ఆరోపించారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి మృతికి సంతాపం



లచ్చిమళ్ల పుల్లయ్య (ఫైల్)

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందాపురంనకు చెందిన ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగి లచ్చిమళ్ల పుల్లయ్య (80) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు పుల్లయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెన్నా సోమయ్య, సంఘం నాయకులు చంద్రశేఖర్, ఎల్.వెంకటేశ్వర్లు, ఎంఎస్ఎన్ రాజు తదితరులు ఉన్నారు.

ఉత్తమ్‌ను కలిసిన శివనాయక్

గరిడేపల్లి : రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ గరిడేపల్లి మండల అధ్యక్షుడు శివనాయక్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

పోటు శ్రీనివాసరావు మృతి బాధాకరం

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో సీపీఎం సీనియర్ నాయకుడు పోటు పుల్లయ్య కుమారుడు పోటు శ్రీనివాసరావు మృతి చెందడం బాధాకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసరావు సోమవారం రాత్రి మృతిచెందారు. దీంతో పలువురు పార్టీ నాయకులు మృతదేహంపై ఎర్రజెండా ఉంచి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య, గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, గ్రామసర్పంచ్ కామళ్ల బుచ్చమ్మ, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, వెలిదెండ గ్రామసర్పంచ్ ఆదూరి పద్మ, నాయకులు వక్కవంతుల మట్టపల్లి రావు, కొల్లు విద్యాసాగర్‌రావు, అంబటి భిక్షం, యానాల సోమయ్య, అంబటి వెంకటయ్య, ములకలపల్లి సైదులు, మామిడి గురుమూర్తి, ములకలపల్లి నాగరాజు, నిడిగొండ శంభయ్య ఉన్నారు.



శ్రీనివాసరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నారాయణ మృతి పార్టీకి తీరని లోటు

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, గీత కార్మిక సంఘం డివిజన్ మాజీ అధ్యక్షుడు నారగాని నారాయణ (74) మృతి పార్టీకి, గీత కార్మిక లోకానికి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మునగాలలో నారాయణ మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలన్నారు. నారాయణకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిన్నెర వెంకన్న, కోదాటి రామచంద్రుడు, గడ్డం వెన్న, దేవరం శ్యామ్‌సుందర్‌రెడ్డి, గడ్డం వినోద్, దేవరం శ్రీనివాసరెడ్డి, ఉప్పుల పిచ్చమ్మ పాల్గొన్నారు.

శివుడికి ప్రత్యేక అభిషేకం

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామ శివారులోని చెరువు వద్ద నూతనంగా నిర్మించిన శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. దేవాలయంలో ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మొదటిసారిగా అభిషేకాలు నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నలబోలు సుజాతాశ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలి

మఠంపల్లి : మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ రఘునాథపాలెంలో రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని గ్రామ యూత్ సభ్యులు, గ్రామస్తులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి నరసింహరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రోడ్లపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనాల వేగం నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కోదాడ అర్బన్: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 21న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను సోమవారం కోదాడలో ఆవిష్కరించి మాట్లాడారు. గతంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, రామారావు, ప్రసాద్, గోపి, విజయ్, బాబురావు, ఉపేందర్, టాజర్ వేణు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు